## క్లుప్తంగా

### డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

పర్చూరు (చినగంజాం): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్చూరు బీఆర్ అండ్ టీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు కోసం మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి పి. ప్రణయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్. శేషకుమారి తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసులోపు యువతీ,యువకులు డిసెంబర్ 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సర్టిఫికెట్లు జారీ చేస్తారని చెప్పారు. వివరాలకు 63027 64962 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### నూరుశాతం పింఛన్ల పంపిణీ లక్ష్యం


పింఛన్ అందిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్యామ్

కారంచేడు: ప్రతి గ్రామంలో 1వ తేదీన అందించాల్సిన పింఛన్లను నూరు శాతం పంపిణీ చేసేలా సిబ్బందిని అప్రమత్తం చేశామని కోఆపరేటివ్‌శాఖ బాపట్ల జిల్లా అధికారి, మండల ప్రత్యేక అధికారి శ్యామ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం కారంచేడు గ్రామంలో పింఛన్ల పంపిణీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నేతాజీ, సచివాలయ సిబ్బంది, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

### మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దు

చీరాల టౌన్: ఫెంగల్ తుఫాన్ కారణంగా మండలంలోని సముద్ర తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ శనివారం ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ తీరం దాటి సాధారణ స్థితికి వచ్చేంత వరకు వాడరేవు, విజయలక్ష్మీపురం ప్రాంతాల్లోని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని, తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వేట సామగ్రి, పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహసీల్దార్ ఆదేశాలిచ్చారు.

# సాగుకు.. సాయం అందక !

- రైతులకు పెట్టుబడి సాయమేదీ?
- రాష్ట్ర ప్రభుత్వ వాటాపై నోరెత్తని కూటమి నాయకులు
- కేంద్రం రెండో విడత సాయం విడుదల
- నియోజకవర్గంలో 9,334 మంది లబ్ధిదారుల ఎదురు చూపులు
- అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20 వేలు పెట్టుబడి సాయం


రైతులు సాగు చేసిన వేరుశనగ పంట

వేటపాలెం: 'మేం అధికారంలోకి వచ్చాక రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేల సాయం అందిస్తాం.. అని ఎన్నికల ముందు చంద్రబాబు, కూటమి నాయకులు చెప్పిన మాటలివి. తీరా అధికారంలోకి వచ్చాక' తమ్ముళ్లు మనం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చాం. డబ్బుల్లేవు.. చూస్తే భయం వేస్తోంది. అని కూటమి సీఎం చంద్రబాబు భయపడుతూ చెప్పిన మాటలు. అంటే అధికారంలోకి రావడానికి ఏవైనా హామీలు ఇవ్వొచ్చు అన్నమాట. వచ్చాక ఇలా తీరిగ్గా మోసం చేయవచ్చు.. అనే రీతిలో ఉన్నారు కూటమి నాయకులు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు ఏమాత్రం ఇబ్బందులు పడకుండా మంచి దిగుబడులు సాధించారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయం కుదేలయింది. పెట్టుబడి సాయం అందక రైతులు అప్పులు తెచ్చి మరీ సాగుచేశారు.

అన్నదాత సుఖీభవ పథకంపై ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు ఇప్పటి వరకు దానిపై నోరు మెదపడం లేదు. ఇప్పటికే పీఎం కిసాన్ రెండు విడతల సాయం అందించింది కేంద్ర ప్రభుత్వం. మరోపక్క అన్నదాతల సాయంపై చంద్రబాబు స్పష్టతనివ్వడం లేదు. పీఎం కిసాన్ రెండో విడత కూడా వచ్చేసినా దీనిపై ఎలాంటి నిర్ణయం ప్రకటించ లేదు. అన్నదాతలకు పెట్టుబడి సాయం కూడా అందించక పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు రైతులు. చీరాల నియోజవర్గ పరిధిలో కొమ్మమూరు కెనాల్ పరిధిలో దాదాపు 2 లక్షల మంది అత్యధికంగా వరి పంట సాగు చేస్తున్నారు. దీనితో పాటు తీర ప్రాంత ఇసుక భూముల్లో వేరుశనగ, మొక్కజొన్న, మినుము, పంటలు సాగు చేశారు. ఈ పంటలన్నీ వివిధ దశలో ఉన్నాయి. ఇప్పటివరకు రైతులు పంట సాగు కోసం రూ.20 నుంచి రూ. 25 వేలు పెట్టుబడి కోసం ఖర్చు చేశారు. ఈ సీజన్ ప్రారంభం నుంచి తుఫానులు వరదలతో రైతులు కొంత మంది పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటల స్థానంలో రైతులు తిరిగి పంటలు సాగు చేసుకున్నారు. రైతులకు పెట్టుబడి పెరిగిపోయి ఇబ్బందులు పడాల్సిన వచ్చింది.

**వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్వర్ణయుగం..**

గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పెట్టు బడుల కోసం ఇబ్బంది పడాల్సిన పనిలేకుండా సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం రైతులకు సాయం అందించింది. కేంద్ర ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ. 6000 , రాష్ట్ర ప్రభుత్వం రూ. 7500 రైతుల ఖాతాలకు జమ చేసేది. ఖరీఫ్ చివర్లో పీఎం కిసాన్ రెండో విడత రూ. 2000, రైతు భరోసా సాయం రెండో విడతగా రూ. 2000 కలిపి రూ. 4000 మొత్తాన్ని రైతుల ఖాతాలకు జయ చేసేవారు. పంట పెట్టుబడి కోసం సన్న, చిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది. గత ఐదేళ్లలో నియోజకవర్గ పరిధిలోని 9,334 వేల మంది రైతులకు లబ్ధి చేకూరడం గమనార్హం.

**ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందలేదు..**



గత ప్రభుత్వంలో రబీ సాగుకు ముందే రైతు భరోసా మా ఖాతాల్లో జమ అయ్యేది. ఇప్పుడు సాగు పూర్తివుతున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి పెట్టుడి సాయం అందలేదు. పెట్టుబడి కోసం వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి ఇబ్బందులు పడుతున్నాం. కొత్తగా వచ్చిన ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

– రామకృష్ణ, రైతు, వేటపాలెం

**ఇచ్చిన హామీని అమలు చేయాలి..**



రైతులకు పెట్టబడి కింద రూ. 20 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని అమలు చేయాలి. ఐదు నెలలు గడిచినా రైతు భరోసాపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణం. కేంద్ర ప్రభుత్వం 13వ విడత రూ.2 వేలు వేసినా కూడా ఈ కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఇవ్వలేదు.

– రాఘవరావు, రైతు

# శివుడికి ప్రత్యేక పూజలు


కొణిదెనలో అలంకరణలో రామలింగేశ్వరుడు


అలంకరణలో అమ్మవారు

బల్లికురవ: కార్తీక మాసం ముగింపులో భాగంగా మండలంలోని శివాలయాల్లో హరహర మహదేవ, శంభోశంకర అంటూ శివనామస్మరణతో హోరెత్తుతున్నాయి. శనివారం కొణిదెన వేమవరం నక్కబొక్కలపాడు, కొండయపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, వైదన, కొప్పరపాడు, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి శివాలయాల్లో శివునికి పంచామృతాలతో అభిషేకం, అమ్మవారి కుంకుమ పూజలు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆదివారంతో వేడుకలు ముగియనున్నాయి. ఆదివారం చెన్నుపల్లి గ్రామంలోని గంగపార్వతి సమేత పరుస వేదిశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటి ఆధ్వరంలో అన్నసంతర్పణ చేపనున్నట్లు డీ. సుబ్రమణ్య శర్మ తెలిపారు.

# అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం


అజెండాలోని అంశాలను చదువుతున్న ఆర్‌ఐ

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపల్ సమావేశంలో పలు అభివృద్ధి పనులు చేసేందుకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా అమోదించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ అధక్షత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా అజెండాలోని 44 అంశాలను ఆర్‌ఐ అర్జునరావు చదివి వినిపించారు సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, మేనేజర్ శ్రీదేవి, టీపీఎస్ శ్రీలక్ష్మీ, ఏఈ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


హిందీ ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

యద్దనపూడి (చినగంజాం): సమాజ నిర్మాణంలో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని ఎంఈవో పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం యద్దనపూడి మండల ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు యూ.గాయత్రిదేవి ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైదన్నారు. 29 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో గాయత్రిదేవి ఎందరో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి తీర్చిదిద్దారని కొనియాడారు. నిబద్ధతతో, క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేశారన్నారు. అనంతరం గాయత్రి దేవిని సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవేంద్రరావు, ద్రోణాదుల హెచ్‌ఎం జంగా పోతురాజు, పూనూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశాం

- మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి,

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి గాదె, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరెడ్డి

చినగంజాం: నియోజకవర్గ అభివృద్ధిలో తాను కీలక పాత్ర పోషించినట్లు రాష్ట్ర మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. బాపట్ల, పర్చూరు నియోజకవర్గాలకు చెందిన వందలాది అభిమానులు ఆయనను కలిసి పూలబోకేలను అందజేసి, పూలమాలలతో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వచ్చిన అందరి అభిమానులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను శాసన సభ్యుడిగా ఉన్న సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ముఖ్యంగా పర్చూరు నియోజకవర్గ అభివృద్ధిలో తన పాత్ర ఎంతో కీలకం అన్నారు. 1959లో ఇండియన్ కాంగ్రెస్‌కు జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యానని అన్నారు. తన హయాంలో గ్రామాల్లో రోడ్లు, అభివృద్ధి చేశానని చెప్పారు. ఇంకొల్లులో కళాశాల, స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేశానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకొల్లు బస్సు డిపో నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట కుమారుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరెడ్డి, పావులూరు సర్పంచ్ వెంకారెట్టి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల రూరల్: ఆధ్యాత్మిక పీఠం చీరాల ఆధ్వర్యంలో స్థానిక స్వర్ణరోడ్డులోని లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్టు బిల్డింగ్‌లో ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు దత్తాత్రేయస్వామి వైభవం అనే ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహిస్తున్నట్లు పీఠం అధ్యక్షుడు ఊటుకూరి వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవచన ఉపన్యాసకుడిగా విశ్రాంత ఉపాధ్యాయులు ప్రవచన విశారద ధర్మవరపు వెంకటరమణ వ్యవహరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సమయాన్ని సద్వినియోగం చేసుకుని భగవంతుని కృప పొందాలని ఆయన కోరారు.

### 5న మండల సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు (అద్దంకి): సంతమాగులూరు మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 11న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

# సమాజంలో బాల్య వివాహాలతో అనర్థాలు


ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

స్వర్ణ (కారంచేడు): సమాజంలో బాల్య వివాహాల వ్యవస్థను రూపుమాపి చిన్నారుల జీవితాలు కాపాడుకొనేలా కృషి చేద్దామని ఐసీడీఎస్ స్వర్ణ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని స్వర్ణ గ్రామంలో సెక్టార్ పరిధిలోని దగ్గుబాడు, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, రంగప్పనాయుడువారిపాలెం, స్వర్ణ, స్వర్ణపాలెం గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మనందరం మన గ్రామాల పరిధిలో బాల్య వివాహ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెడదామన్నారు. అనంతరం బ్యాంక్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నివారణ మనందరి బాధ్యత


మార్టూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

చీరాల అర్బన్/చీరాల టౌన్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులపై వివక్షత చూపడం నేరమని.. వారికి మనోధైర్యాన్ని కల్పించడం అందరి బాధ్యతని మహిళామండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహిళా మండలి టీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్లకార్డులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎయిడ్స్, హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ వెంకటరావు, మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

**టీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ర్యాలీ..**

వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా చీరాల మహిళా మండలి టీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొలిమేర రోడ్డులోని మహిళా మండలి నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లో హెచ్‌ఐవీ రహిత సమాజం మన ధ్యేయం, హెచ్‌ఐవీ నివారణకు మందులు పూర్తిగా ఉచితం, ఎయిడ్స్ నివారణ మనందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎంఎంసీ ప్రోగ్రాం మేనేజర్ కె.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల రూరల్: వివాహానికి ముందు యువతి, యువకులు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని షాడోస్ సంస్థ ప్రతినిధి డాక్టర్ డేవిడ్‌సన్ సాల్మన్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని షాడోస్, వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజి, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైఏ మహిళా కాలేజిలోని విద్యార్థినులకు హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డేవిడ్‌సన్ సాల్మన్ మాట్లాడారు. హెచ్‌ఐవి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమానికి ముందుగా విద్యార్థినులతో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో షాడోస్ సిబ్బంది భాగ్యలక్ష్మి, అలేఖ్య, ఉమెన్ ఎంపవర్‌మెంట్ రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ రత్నపాక, రోహిణి, మీనా, అభిజిత్, పావని, పిచ్చేశ్వరరావు కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

**హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన సాధ్యం**

మార్టూరు: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనను సామాజిక హక్కు బాధ్యతగా భావించినప్పుడే అరికట్టగలమని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా శనివారం మార్టూరులో దిశ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థలు, రోటరీ క్లబ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో మార్టూరులో ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, రోటరీ ప్రతినిధులు, హెల్ప్, దిశ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



చీరాలలో విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు


మహిళా మండలి ఆధ్వర్యంలో ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

# మహిళలు స్వశక్తితో ఎదగాలి


శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న బాపయ్య రోటరీ ప్రతినిధులు

మార్టూరు: మహిళలు ఏ రంగంలోనైనా స్వయం సమృద్ధి సాధించడానికి ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు రావుల బాపయ్య అన్నారు. మార్టూరు రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అమ్మ అనాథ ఆశ్రమంలో గత మూడు మాసాలుగా నిర్వహించిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాపయ్య శిక్షణ పొందిన వారిలో పేద మహిళ దండవరపు రమణమ్మకు ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేశారు. టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు రోటరీ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మద్దు మాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలుషేక్ హబీజున్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీలో అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆంజనేయులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అంగవైకల్య నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ సివిల్ సర్జన్ కె.ఆంజనేయులు తెలిపారు. ప్రతి శనివారం ఆన్ లైన్ డేటా ప్రకారం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తారని వివరించారు. పరీక్షల అనంతరం సర్టిఫికెట్లను సమీప మీసేవ ద్వారా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### అలనాటి చిత్రాలు కళాత్మకం

అద్దంకి రూరల్: అలనాటి చిత్రాలు కళాత్మకంగా ఉండేవని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అద్దంకిలో చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో అలనాటి సినీనటుల గురించి జ్ఞాపకం చేసుకున్నారు. ఆచంట వెంకటరత్నం కళా వేదికగా జరిగిన సభకు జ్యోతి చంద్రమౌళి అధ్యక్షత వహించారు. సినీ నటుడు ప్రభాకరరెడ్డి గురించి దాసరి లక్ష్మి ప్రసంగించారు. అదే విధంగా మరో సినీ నటి గిరిజ గురించి గ్రంధి నాగరాజ కుమారి ప్రసంగించారు. హాస్యం ప్రధానంగా మాత్రమే కాకుండా చక్కని కుటుంబ కథా చిత్రాల్లో మంచి పాత్రలతో అలరించిన గిరిజ గొప్ప నటి అని పలు చిత్రాలను గురించి వివరించారు. అలాగే ప్రభాకర రెడ్డి నటన గురించి పలు సినిమాలను ఉదహరిస్తూ ప్రసంగించారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్యను సన్మానించారు. కార్యక్రమానికి సీతారామశాస్త్రి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో అన్నమనేని వెంకట్రావు, ఆర్వీ రాఘవరావు, చందలూరి నారాయణరావు, దేవపాలన, కోటయ్య పాల్గొన్నారు.

### శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, అనూరాధ నక్షత్రం, అమావాస్య తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

### బాధితులకు అండగా సీఎం సహాయనిధి


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: అనారోగ్యంతో బాధపడుతూ కార్పోరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. గంజిపాలెంకు చెందిన చుక్క సురేంద్ర కుమారుడు నాగ వెంకట్‌కు రూ.88 వేలు, పాపరాజుతోటకు చెందిన ఎ.నాగవెంకటసాయి మణికంఠకు రూ.1,00,516, ఈపూరుపాలెం రామేశ్వరం అభినవ్‌కు రూ.2.50 లక్షలు, గవినివారిపాలేనికి చెందిన నర్రా ఆంజనేయులుకు రూ.52 వేలు, ప్రసాద్‌నగర్‌కు చెందిన బాపట్ల శ్రీనివాసరావుకు రూ.28 వేలు బుర్లవారిపాలెంకు చెందిన ఎనుముల మల్లేశ్వరికి రూ.20 వేలు సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.